క్లుప్తంగా

అచ్చమ్మ తల్లి ఆలయంలో వాటర్ ట్యాంక్ ఏర్పాటు



ట్యాంక్‌ను ఏర్పాటు చేసిన ఆలయ కమిటీ సభ్యులు

దెందులూరు: గాలాయగూడెం అచ్చమ్మ పేరంటాలు తల్లి ఆలయ ఆవరణలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 8 వేల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకులు నిర్మించారు. ఇకపై అమ్మవారి ఆలయం కల్యాణ మండపానికి సంబంధించి తాగునీటికి ఎటువంటి ఇబ్బందులు ఉండవన్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని శాశ్వత పరిష్కారం లక్ష్యంగా 8 వేల లీటర్ల ట్యాంకును ఏర్పాటు చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి

భీమడోలు: ఎన్నికల హామీలను విస్మరించి, నిరుద్యోగులను, ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్న కూటమి ప్రభుత్వానికి రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లు బుద్ధి చెప్పాలని సీఐటీయూ, ప్రజా సంఘాల నాయకులు కోరారు. ఉభయ గోదావరి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ సోమవారం నాయకులు అంబర్‌పేటతోపాటు పలు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి విస్తృత ప్రచారం చేసారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

దెందులూరు: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ ఉద్యోగులు ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటికి సోమవారం వినతిపత్రం అందజేసినట్టు దెందులూరులో 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు తోట ఎడ్వర్డ్ తెలిపారు. గత ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మానవతా దృక్పథంతో 4,070 మందిని టీచర్లుగా నియమించి, ఎంతో మేలు చేశారని ఆయన అన్నారు. శాఖ పరంగా తమకున్న సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాన్ని ఏలూరు ఎమ్మెల్యేకు అందజేశామని తెలిపారు. యూనియన్ సభ్యులు ప్రభుదాసు, కరుణానిధి, బాజీ, బాషా, యేసు పాదం ఉన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణ



జ్ఞానజ్యోతి శిక్షణను పరిశీలిస్తున్న ఎంఈవో వెంకట్రావు

ఉంగుటూరు: జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం ఉంగుటూరు హైస్కూల్లో నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణ తరగతులను పర్యవేక్షించిన మండల విద్యాశాఖ అధికారి వెంకట్రావు మాట్లాడుతూ జ్ఞానజ్యోతి సర్టిఫికెట్ అంగన్‌వాడీ కార్యకర్తల ఉద్యోగ ఉన్నతికి ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు తయారుచేసిన బోధనాభ్యసన సామగ్రిని హెచ్‌ఎం మీరాకుమారి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రిసోర్సు పర్సన్స్ అల్లు శ్రీను, శిరికి శివ, యు.శివకుమార్, బీవీ శ్రీలక్ష్మి, డి.శారదామణి, సీఆర్‌ఎం టి.విష్ణు నారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులు పరీక్షలపై భయం విడనాడాలి



పిప్పరలో పదో తరగతి ప్రీ పబ్లిక్ పరీక్షలను తనిఖీ చేస్తున్న ఎంపీడీవో, ఎంఈవో

గణపవరం: పదోతరగతి విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివితే పరీక్షల్లో విజయం సాధించవచ్చునని, పబ్లిక్ పరీక్షలపై భయం వద్దని సూచించారు. సోమవారం వారు గణపవరం మండలం అర్ధవరం, పిప్పర జెడ్పీ ఉన్నత పాఠశాలలు, పిప్పర పబ్లిక్ స్కూల్లో నిర్వహిస్తున్న ప్రీ పబ్లిక్ పరీక్షల నిర్వహణను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం తనిఖీ చేశారు. ఆహార పదార్థాల రుచి, నాణ్యతలను పరిశీలించారు. విద్యార్థులతో కలసి భోజనం చేశారు. పాఠశాలకు వచ్చే విద్యార్థులంతా బడిలోనే భోజనం చేసేలా చూడాలని వారు హెచ్‌ఎంకు సూచించారు.

రెండు దఫాలుగా విద్యుత్ సరఫరాతో ఇక్కట్లు

- నిరంతరాయంగా 9 గంటల సరఫరాకు మంగళం
- రాత్రి వేళల్లో పొలాల వద్ద రైతులు పడిగాపులు
- ప్రభుత్వ నిర్ణయంపై రైతుల ఆగ్రహం



దెందులూరు విద్యుత్ సబ్‌స్టేషన్

దెందులూరు నియోజవర్గంలో సబ్‌స్టేషన్లు	
దెందులూరు మండలం	7 సబ్‌స్టేషన్లు
పెదవేగి మండలం	13 సబ్‌స్టేషన్లు
పెదపాడు మండలం	5 సబ్‌స్టేషన్లు

దెందులూరు: దేశానికి అన్నం పెట్టే రైతన్నపై కూటమి ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపిస్తోంది. ఆరుగాలం శ్రమించి వ్యవసాయమే ప్రధాన వృత్తిగా నమ్ముకుని దశాబ్దాలుగా జీవిస్తున్న రైతులకు కూటమి ప్రభుత్వంలో ఒరిగిందేమీ లేదు. రూ.లక్షలు పెట్టుబడి పెట్టి వ్యవసాయాన్ని నమ్ముకుని కుటుంబాలను పోషించుకుంటున్న రైతులు తొమ్మిది నెలలుగా కష్టనష్టాల బాట పట్టారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వ్యవసాయానికి నిరంతరంగా పగటిపూట 9 గంటలపాటు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేసేవారు. ఈ విధానం వల్ల రైతులు పూర్తిస్థాయిలో లాభపడ్డారు. సాగు నీటి కోసం రాత్రి వేళల్లో పొలాల వద్ద పడిగాపులు పడే పరిస్థితులు గతంలో లేవు. రైతు భరోసా సాయం కూడా గత ప్రభుత్వం సక్రమంగా అందించి భరోసాగా నిలిచింది. ఇందుకు భిన్నంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని రైతులు అంటున్నారు. సక్రమంగా వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేయకపోవడంతో గ్రామాల్లో శివారు ప్రాంతాల్లోని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయానికి 9 గంటలు విద్యుత్ సరఫరా చేయాల్సిన కూటమి ప్రభుత్వం ఈ విధానానికి మంగళం పాడటం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. ప్రతి సభలోనూ కూటమి నాయకులు రైతుల సంక్షేమానికి అనేక హామీలిచ్చి అధికారం చేపట్టిన తర్వాత వాటన్నింటినీ విస్మరించారు. రోజులో 7 గంటల పాటు పగటి పూట, మరలా రాత్రి 10 నుంచి 12 గంటలకు విద్యుత్ సరఫరా చేయడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. రాత్రి పది గంటలకు పొలాల్లో గట్లపై నడుచుకుంటూ మోటార్ల వద్దకు వెళ్లాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి 10 నుంచి 12 గంటల వరకు రెండో షిఫ్ట్ అయ్యే వరకు పొలాల్లోనే వేచి ఉండాల్సి వస్తోందని వారన్నారు. కొన్ని ప్రాంతాల్లో రెండో షిఫ్ట్ రాత్రి 10 నుంచి 12 గంటల వరకు ఒక్కో సారి తెల్లవారుజామున 3 నుంచి 5 గంటల వరకు ఇస్తున్నారని ఇది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో లేని ఇబ్బంది కూటమి ప్రభుత్వ హయాంలో ఎందుకు వచ్చిందని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఈ విధానం తమకు ఆమోదయోగ్యం కాదని రెండు షిఫ్ట్‌ల వల్ల వేలాది మంది తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని రైతులు వాపోతున్నారు. రెండు షిఫ్ట విధానం కూటమి ప్రభుత్వం మార్చకపోతే రైతులు, రైతు సంఘాలు త్వరలోనే సమావేశమై భవిష్యత్తులో ఆందోళనలు చేస్తామని వారంతా హెచ్చరిస్తున్నారు. నియోజవర్గంలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు దెందులూరు, పెదవేగి, పెదపాడు మండలాల్లో 9వేలకు పైగా ఉన్నాయి.

రెండు షిఫ్ట్‌ల విధానం దుర్మార్గం



కూటమి ప్రభుత్వం రెండు షిఫ్ట్‌ల విధానం అమలు చేయడం దుర్మార్గం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వ్యవసాయానికి నిరాటంకంగా 9 గంటలపాటు విద్యుత్ సరఫరా చేశారు. రెండు షిఫ్ట్‌ల విధానం అమలు చేయలేదు. కూటమి ప్రభుత్వం తొమ్మిది గంటలు నిరాటంకంగా కరెంట్ ఇవ్వడం లేదు.

– శనిపల్లి రామకృష్ణ (విష్ణు), సర్పంచ్, సానిగూడెం

రైతుల కోసం పోరాటం



రైతులందరికీ ఇబ్బంది కలగకుండా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. రెండు షిఫ్ట్‌ల విధానం తక్షణమే విరమించుకోవాలి. 9 గంటల విధానం అమలు చేయాలి. రైతులకు న్యాయం జరిగేంతవరకు పోరాటం చేస్తాం.

– ఎం సూర్యనారాయణ, హస్తకళల కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్

రైతులు అవస్థలు ఎదుర్కొంటున్నారు



అధికారులు రాత్రి వేళల్లో పొలాలకు వస్తే రైతుల ఇబ్బందులు తెలుస్తాయి. రెండు షిఫ్ట్‌ల విధానం వల్ల రైతులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. విద్యుత్ సరఫరాను ఎవరైనా రాత్రి పూట ఇస్తారా? రైతులందరూ పొలాల్లో కాపలా ఉండాలి. ఈ విధానం సరైనది కాదు.

– పర్వతనేని నరేంద్రబాబు, రైతు, మలకచర్ల

ప్రభుత్వం స్పందించాలి



వ్యవసాయానికి రెండు షిఫ్టుల విద్యుత్ సరఫరా విధానం అమలుపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలి. ఈ విధానాన్ని వెంటనే నిలుపుదల చేయాలి. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు క్షేత్రస్థాయికి వచ్చి రైతుల సమస్యలను తెలుసుకుని వాటిని శాశ్వతంగా పరిష్కరించాలి.

– డీబీఆర్‌కే చౌదరి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి

రైతుల్లో తీవ్ర అసంతృప్తి



వ్యవసాయానికి 9 గంటలు నిరంతరాయంగా కరెంటు ఇవ్వకపోవడంపై రైతులంతా తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. రెండు షిఫ్ట్‌ల విధానం రైతులకు ఆమోదయోగ్యం కాదు. వ్యవసాయానికి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– కొలుసు గణపతిరావు, రైతు, దెందులూరు కోఆపరేటివ్ సొసైటీ మాజీ ఛైర్మన్

రెండు షిఫ్టులు వాస్తవమే

దెందులూరు నియోజకవర్గంలో రెండు షిఫ్ట్‌ల విధానంలో విద్యుత్ సరఫరా చేయడం వాస్తవమే. పగటిపూట 7 గంటలు విద్యుత్ ఇచ్చి, రాత్రి రెండు గంటలపాటు రెండో షిఫ్ట్‌లో విద్యుత్ సరఫరా చేస్తున్నాం. సబ్ స్టేషన్లలో సాంకేతికపరమైన ఇబ్బందులను పరిష్కరిస్తున్నాం.

– శ్రీనివాసరావు, ఏడీఈ, విద్యుత్ శాఖ

త్రో బాల్ పోటీ విజేత కొప్పాక జట్టు



త్రో బాల్‌లో విన్నర్స్‌గా నిలిచిన కొప్పాక బాల, బాలికలను అభినందిస్తున్న హెచ్‌ఎం ఆర్ శైలజ

పెదవేగి : దెందులూరు నియోజకవర్గ వ్యాప్తంగా నిర్వహించిన జోన్ గ్రిగ్స్ ఆటల పోటీల్లో త్రో బాల్ బాల, బాలికల విభాగంలో తమ విద్యార్థులు సత్తా చాటి విజేతలుగా నిలిచారని పాఠశాల హెచ్‌ఎం ఆర్. శైలజ చెప్పారు. ఈనెల 22న కొవ్వలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో నిర్వహించిన గ్రిగ్స్‌లో కొప్పాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు చక్కటి ప్రతిభ కనబరిచిన సందర్భంగా నిర్వహించిన అభినందన సభలో విజయం సాధించిన పాఠశాల బాల బాలికలను పీడీ మోర్ల శ్రీనివాసరావును హెచ్‌ఎం, పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

జ్వరాలపై ఇంటింటా సర్వే



నిల్వ నీరు ఉన్న తొట్టెలను ఖాళీ చేస్తున్న దృశ్యం

దెందులూరు: గ్రామాల్లో జ్వరాలపై సర్వే కొనసాగుతోందని పోతునూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం పోతునూరు వైద్యశాల పరిధిలోని గ్రామాల్లో వైద్య సిబ్బంది చేస్తున్న జ్వరాలపై సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి అనారోగ్య సమస్యలున్నా వైద్య సిబ్బంది ఇళ్లకు వచ్చినప్పుడు వారికి తెలియజేయాలన్నారు. వైద్య సిబ్బంది సర్వేకు వచ్చినప్పుడు ప్రజలు వారికి పూర్తి సహాయ సహకారాలు అందించాలని డాక్టర్ ప్రవీణ్ కుమార్ కోరారు. ఎంపీహెచ్‌ఓ హరి, సిబ్బంది ఉన్నారు.

ఉదయం మంచు.. మధ్యాహ్నం హడలెత్తిస్తున్న ఎండ



జాతీయ రహదారి భీమడోలులో ఉదయం పొగమంచు



మధ్యాహ్నం ఎండ కారణంగా నిర్మానుష్యంగా భీమడోలు రోడ్డు

భీమడోలు: ఓ పక్క ఉదయం మంచు దుప్పటి కమ్మేసింది. మరో పక్క మధ్యాహ్నానికి ఎండ ఠారెత్తిస్తోంది. వాతావరణంలో విచిత్ర పరిస్థితుల నేపథ్యంలో అనేక మంది అనారోగ్యం బారిన పడుతున్నారు. దీనితో భానుడి ప్రతాపానికి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మహాశివరాత్రి వస్తున్నా తగ్గని మంచు. గతం కన్నా ముందుగానే ఎండలు తీవ్రమవుతుండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. సోమవారం ఉదయం 8 గంటల వరకు మంచు పరదాలు తొలగడం లేదు. దీనితో రాష్ట్ర రహదారుల్లో వాహనదారులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. ఉదయం 11 గంటల తర్వాత ఎండ ప్రభావం తీవ్రమవ్వడంతో మధ్యాహ్నానికి వాహనదారులు రోడ్లపై కనిపించని పరిస్థితి నెలకొంటోంది. ఈ ఏడాది ఎండలు ముందుగానే వస్తాయని, గతంలో కన్నా ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. 45 నుంచి 50 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు పెరిగిపోతాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ఉదయం మంచు.. మధ్యాహ్నం ఎండల వల్ల వాతావరణంలో హెచ్చుతగ్గుల నేపథ్యంలో ఆరోగ్యంపై ప్రభావం పడుతుందని, తగిన జాగ్రత్తలు పాటించాలని వైద్యులు చెబుతున్నారు. ఎక్కువగా నీళ్లు, కొబ్బరి బొండాల నీళ్లు, ఓఆర్‌ఎస్ ద్రావణాన్ని తాగి ఎండల నుంచి ఉపశమనం పొందవచ్చునని వైద్యులు సూచిస్తున్నారు. పంట పొలాలపై మంచు, ఎండలు పడడంతో తెగుళ్ల బారిన పడ్డాయని రైతులు వాపోతున్నారు.

శిక్షణ తరగతులతో అదనపు జ్ఞానం



అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేసిన టీఎల్‌ఎంలు పరిశీలిస్తున్న ఎంపీడీవో బేబీ శ్రీలక్ష్మి

గణపవరం: శిక్షణ తరగతుల ద్వారా అదనపు జ్ఞానం సంపాదించవచ్చునని, శిక్షణలో పొందిన జ్ఞానం తరగతి గదుల్లో ఉపయోగించినప్పుడే ఫలితం ఉంటుందని గణపవరం ఎంపీడీవో బేబీ శ్రీలక్ష్మి, ఎంఈవో గొర్రెల బాలయ్య అన్నారు. సోమవారం గణపవరంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇస్తున్న ఎఫ్ఎల్ఎన్ జ్ఞాన జ్యోతి శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల సంసిద్ధత మేళాను వారు ప్రారంభించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేసిన టీఎల్ఎం (బోధనోపకరణాలు) వారు పరిశీలించారు. టీఎల్ఎం తయారు చేసిన అంగన్‌వాడీ కార్యకర్తలను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పి.తులసి, దుర్గాభవాని, డీఆర్పీలు కె.అపర్ణ, ఎం.పెద్దిరాజు, జీవీఎస్ రాజు, సీఆర్పీలు ఎం.జోగయ్య, కె.కిషోర్ పాల్గొన్నారు.

పాఠశాల సంసిద్ధతపై ఎంఈఓ సమీక్ష

దెందులూరు: అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతంతోనే స్త్రీ శిశు సంక్షేమ అభివృద్ధి జరుగుతుందని దెందులూరు ఎంఈఓ అన్నమ్మ అన్నారు. సోమవారం దెందులూరు ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్లు చిట్టెమ్మ, శ్రీదేవి భూషణం ఆధ్వర్యంలో మండలంలోని అంగన్‌వాడీ టీచర్లకు జ్ఞాన జ్యోతి పథకం సెక్షన్‌లో పాఠశాల సంసిద్ధతపై సమీక్ష నిర్వహించారు. హెచ్‌ఎం మల్లికార్జునరావు, ఉపాధ్యాయులు జైపాల్, పాండురంగారావు, గొల్లపూడి వెంకటేశ్వరరావు ఉన్నారు.

దివ్యాంగుల హక్కులపై అవగాహన సదస్సు



దివ్యాంగుల హక్కులను అంగన్‌వాడీలకు వివరిస్తున్న రిసోర్స్ పర్సన్లు

పెదవేగి : మేనరికపు వివాహం చేయవద్దని, 18 ఏళ్ల లోపు బాల్య వివాహాలు, గర్భధారణ ఆరోగ్యానికి ప్రమాదకరమని రిసోర్స్ పర్సన్ సీహెచ్ నవీన్ కుమార్ అన్నారు. సోమవారం పెదవేగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమంలో దొండపాడులోని ఉమా ఎడ్యుకేషన్ – టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ఆధ్వర్యంలో 2016 దివ్యాంగుల హక్కుల చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రిసోర్స్‌పర్సన్ సి. ఎచ్.నవీన్‌కుమార్, సంస్థ కో ఆర్డినేటర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రభుత్వం ప్రత్యేక హక్కులను కల్పించిందన్నారు. డీడీఆర్‌సీ కేంద్రం ద్వారా క్యాంపులు నిర్వహించి, దివ్యాంగుల గుర్తింపునకు సర్వేలు చేయటం, జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రంలో ఫిజియోథెరపీ, ఆడియోలజీ, సైకాలజీ సేవలందించడంతోపాటు కృత్రిమ అవయవాలు ఉచితంగా అందిస్తామని తెలిపారు. మరింత సమాచారం కోసం 08812-249297,7386565469 నెంబర్‌కి సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఆర్పీలు లక్ష్మీనారాయణ, ఫాతిమా, డీడీఆర్‌సీ కేంద్రం సిబ్బంది, పాల్గొన్నారు.

పోలవరం కాలువ గట్టుపై కోళ్ల కళేబరాలు



ఆంజనేయనగరం పోలవరం గట్టుపై కోళ్లు కళేబరాలు



కాలువలో దర్శనమిస్తున్న చనిపోయిన కోళ్లు

భీమడోలు: పోలసానిపల్లి పంచాయతీ శివారు ఆంజనేయనగరం వద్ద గల పోలవరం కాలువ గట్టుపై సోమవారం మృత్యువాత పడిన వందలాది కోళ్లు దర్శనమిచ్చాయి. వాటిలో చాలా వరకు కాలువలో తేలియాడుతున్నాయి. చనిపోయిన కోళ్ల నుంచి వచ్చే దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాలువలోని నీరు కలుషితమై పంట పొలాలకు చేరుతోందని రైతులు అంటున్నారు. ఈ ఘటన చూస్తే బర్డ్‌ఫ్లూ ప్రభావం తగ్గినట్లు కనిపించడం లేదు. భీమడోలు, ఉంగుటూరు, తాడేపల్లిగూడెం ఏరియాల్లో తెలంగాణ, సత్తుపల్లి ప్రాంతాల నుంచి కోళ్లను వాహనాల్లో తీసుకుని వచ్చి హోల్‌సేల్‌గా విక్రస్తున్నారు. ఈ క్రమంలో వాహనాల్లో బతికి ఉన్న కోళ్లను దుకాణాలకు అందించి, చనిపోయిన వాటిని ఇలా పోలవరం కాలువ గట్టుపై సోమవారం తెల్లవారుజామున పడేసి వెళ్లిపోయినట్లు అనుమానిస్తున్నారు. దుకాణదారులు వినియోగం కోసం భారీగా కోళ్ల స్టాక్ తెచ్చుకోగా వాటిలో చనిపోయిన కోళ్లను ఇలా కాలువ గట్టుపై వదిలేసి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. దీనిపై పోలసానిపల్లి, ఆంజనేయనగరం, పంగిడిగూడెం ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. బర్డ్‌ఫ్లూ ప్రజలు కలకలం చెందుతుండగా సంబంధిత అధికారులు, పౌల్ట్రీ అసోసియేషన్ వారు ప్రభావం లేదని చెబుతున్నా ఇలాంటి సంఘటనలు ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. సమాచారం అందుకున్న సర్పంచ్ షేక్ రహీమాబేగం, గ్రామ కార్యదర్శి జయరామకృష్ణ స్పందించారు. ఆ కోళ్లను బయటతీసి వాటిని గోతుల్లో పూడ్చే పనులు చేపట్టినట్లు వారు చెప్పారు.

చిన్నారుల్లో మనోవికాసం పెంపొందించాలి



భీమడోలులో గ్రాడ్యుయేషన్ డేలో చిన్నారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు

భీమడోలు: అంగన్‌వాడీ కార్యకర్తలు జ్ఞానజ్యోతి శిక్షణను సద్వినియోగం చేసుకుని ప్రీ స్కూలు విద్యార్థుల్లో మనో వికాసం పెంపొందించేందుకు కృషి చేయాలని భీమడోలులో కోర్సు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు అన్నారు. భీమడోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జ్ఞానజ్యోతి కార్యక్రమంలో భాగంగా రెండవ దఫా శిక్షణ తరగతులు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా సోమవారం సామాజిక బాధ్యత– సంసిద్ధత అంశాలపై అంగన్‌వాడీ కార్యకర్తలు చక్కని ప్రతిభను చాటుకున్నారు. వారంతా సృజనాత్మక రూపాలు తయారీ చేసి ఔరా అనిపించుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల నుంచి చిన్నారులను తీసుకుని వచ్చి గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించి కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు పట్టా ఇచ్చారు. ఈ ప్రదర్శనలు చిన్నారుల సమగ్రాభివృద్ధికి దోహద పడతాయని కోర్సు డైరెక్టర్ బి.శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్పీలు ఎం.శరీన్, గోపాలకృష్ణ, సూపర్‌వైజర్లు ఎస్‌కే నూర్జహాన్, ఎం.కవిత, సీఆర్‌పీలు రాధాకృష్ణ, సత్య ప్రసాద్, రమణ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కబడ్డీ, ఖోఖోలో పోతునూరు పాఠశాల జట్టు ప్రతిభ

దెందులూరు: జోనల్‌స్థాయి పోటీల్లో పోతునూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభ చాటారని ఫిజికల్ డైరెక్టర్ ఎం. కృష్ణారావు అన్నారు. సోమవారం పోతునూరు ఉన్నత పాఠశాలలో ఆయన మాట్లాడుతూ కబడ్డీలో రన్నర్స్, ఖోఖోలో తమ విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారని తెలిపారు హెచ్‌ఎం అలీ విద్యార్థులను అభినందించారు.

ఘనంగా గంగానమ్మ జాతర

పెదవేగి : మూడు రోజులుగా వైభవంగా గంగానమ్మ జాతర మహోత్సవాలు కొనసాగుతున్నాయి. పెదవేగి మండలం కూచింపూడిలో గంగానమ్మ జాతరను స్థానికులు 12 ఏళ్లకు ఒకసారి నిర్వహిస్తారు. సోమవారం అశేష సంఖ్యలోభక్తులు ఆలయానికి తరలిరావడంతో రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి. పెదవేగి – రామశింగవరం రహదారిలో జాతర సందర్భంగా రద్దీ నెలకొంది.

శిథిలమైన వ్యవసాయ శాఖ కార్యాలయం




ఉంగుటూరులో వ్యవసాయశాఖ కార్యాలయం

ఉంగుటూరు: వ్యవసాయ శాఖ కార్యాలయం శిథిలమైంది. సుమారు 30 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ కార్యాలయం శిథిలమవడంతో వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని గ్రామ రైతుభరోసా కేంద్రంలోకి మార్చారు. అక్కడ ప్రస్తుతం కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఉంగుటూరులో నూతన మండల వ్యవసాయ శాఖ కార్యాలయం ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

చిన్న కాశీగా విరాజిల్లుతున్న చల్లచింతలపూడి శివాలయం





చల్లచింతలపూడిలో పురాతమైన శివాలయం

దెందులూరు: జిల్లాలోనే ప్రాచీనమైన, ఘన చరిత్ర కలిగిన చల్లచింతలపూడిలోని శివాలయం చిన్న కాశీగా ప్రసిద్ధిచెందింది. దెందులూరు మండలంలో 600 ఏళ్ల క్రితం వేంగి రాజులు ఈ శివాలయాన్ని నిర్మించారని, స్వయంభుగా శివుడు ఇక్కడ వెలిశాడని పురాణ కథనం. కాశీకి వెళ్లలేనివారు ఇక్కడ చల్ల చింతలపూడిలోని శ్రీ మేధా దక్షిణామూర్తిని దర్శిస్తే కాశీలో శివుడుని దర్శించినట్లేనని భక్తుల విశ్వాసం. ఇక్కడ శివరాత్రి మహోత్సవాన్ని గ్రామస్తులు వైభవంగా నిర్వహిస్తారు. ఈనెల 26 నుంచి ఐదురోజులపాటు శివాలయంలో ఉత్సవాలు నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు.